సాక్షి
నిజామాబాద్
గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



మొరం దందా!
మాక్లూర్ మండలంలో కొందరు అక్రమార్కులు గుట్టలను తొలిచి మొరంను యథేచ్ఛగా తరలిస్తున్నారు.
- 8లో ▸



గణితం ఎంతో సులువు
అర్థం చేసుకుంటే గణితం ఎంతో సులువని తెలంగాణ యూనివర్సిటీ వీసీ రవీందర్ గుప్తా పేర్కొన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.8 /18.9

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలితీవ్రత కొనసాగుతుంది.

రైతన్న మృత్యుఘోష!

2022 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు.. జిల్లాలో విద్యుత్ షాక్‌తో మరణాలు (వ్యవసాయదారులే అధికం)

31 మరణాలు | **18** క్షతగాత్రులు | **49** పశువులు(మృతి)

- అన్నదాతల ప్రాణాలు తీస్తున్న రాత్రి కరెంటు
- మోటార్లు వేసేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురి
- రెండు రోజుల్లో వరుసగా ఇద్దరు మృతి
- ప్రమాదం తెచ్చిపెడుతున్న లోవోల్టేజీ సమస్య

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : వ్యవసాయానికి 24 గంటల త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఆచరణలో అమలు కావడం లేదు. రాత్రి వేళ సరఫరాతో పంటలను కాపాడుకునేందుకు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్తున్న రైతులు అగచాట్లు పడుతున్నారు. ముఖ్యంగా లోవోల్టేజీతో మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోతున్నారు.

జిల్లాలో సోమవారం రాత్రి ధర్పల్లి మండల కేంద్రానికి చెందిన రైతు తోట పెద్ద లింబాద్రి తన వ్యవసాయ క్షేత్రంలో మోటారు వేసేందుకు వెళ్లి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మంగళవారం రాత్రి ఆర్మూర్ సిద్ధులగుట్ట ఆలయ కమిటీ చైర్మన్ అయిన రైతు శేఖర్‌రెడ్డి తన వ్యవసాయ క్షేత్రం వద్ద విద్యుదాఘాతంతో మరణించాడు. దీంతో ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న వరి ని కాపాడుకునేందుకు తాపత్రయపడుతున్న రైతు లు విద్యుత్ ప్రమాదాలతో హడలి పోతున్నారు.

- జిల్లాలోని ఆయా మండలాల్లో త్రీఫేజ్ కరెంట్ సరఫరా మూడు నాలుగు రోజులకు షెడ్యూల్ మారుతోంది. రోజుకు వివిధ ప్రాంతాల్లో వివిధ రకాలుగా 12 నుంచి 14 గంటల మేర త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అవుతోంది. ఆటోస్టార్టర్లు ఉన్నప్పటికీ లోవోల్టేజీ సమస్యతో రైతులు రాత్రి సమయాల్లో వ్యవసాయ భూముల వద్ద పడిగాపులు పడాల్సి వస్తోంది.



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన శేఖర్‌రెడ్డి



బోధన్ మండలం నాగన్‌పల్లి శివారులో పొలాల మధ్య ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు

జిల్లాలో అనేక చోట్ల పంట పొలాల మధ్య విద్యుత్ స్తంభాల తీగలు చేతికందేలా, ట్రాన్స్‌ఫార్మర్లు ఓపెన్‌గా రక్షణ లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. పలు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు సిమెంట్ రింగులపై ఏర్పాటు చేశారు. అవి కొన్ని చోట్ల కూలిపోయే పరిస్థితిలో ఉన్నాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు వంగిపోయి ఈదురుగాలులకు పడిపోయేలా ఉన్నాయి.

క్రమపద్ధతి లేకుండా విద్యుత్ సరఫరా..



వ్యవసాయానికి విడతలవారీగా 12 గంటల మేరకే త్రీఫేజ్ విద్యుత్ ఇస్తున్నారు. రాత్రి వేళల్లో సరఫరాతో రైతులు బోరుబావుల వద్ద పడికాపులు కాస్తున్నారు. లోవోల్టేజ్ వల్ల పంపు మోటార్లు మరమ్మతులకు గురవుతుండడంతో దాన్ని సరిచేసే సమయంలో విద్యుత్ షాక్‌కు గురై మరణిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నిరంతరత విద్యుత్ సరఫరా చేయాలి. ధర్పల్లిలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రైతు కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారాన్ని చెల్లించాలి.

–చెలిమెల నర్సయ్య, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి

బోరు బావులే ఆధారం..



భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరాలో అంతరాయంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండలు ముదరడంతో పొట్టదశకు వచ్చిన వరి పంటను కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరాతో చివరి మడి వరకు నీళ్లు అందించాలనే తాపత్రయంతో రైతులు ప్రమాదాలకు గురై మరణిస్తున్నారు.

–ఆర్మూర్ బాలరాజు, ధర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

విద్యుదాఘాతంతో రైతు మృతి



శేఖర్‌రెడ్డి (ఫైల్)

ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ పట్టణంలో బుధవారం నవనాథ సిద్దుల గుట్ట ఆలయ కమిటీ చైర్మన్, రైతు ఏనుగు శేఖర్ రెడ్డి(48) తన వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్ ఘాతానికి గురై మరణించాడు. ఉదయం పొలంలో నీరు పారించడానికి వెళ్లాడు. బోరు మోటారు స్టార్టర్‌ను ముట్టుకోవడంతో కరంటు షాక్ తగిలి మృతి చెందాడు. విషయం తెలిసిన ఎమ్మెల్యే జీవన్ రెడ్డి హైదరాబాద్ నుంచి వచ్చి నేరుగా అంతక్రియలో పాల్గొని పాడెమోశారు.

24 గంటలు ఇవ్వాలి



రాష్ట్ర ప్రభుత్వం పొలాలకు సరైన కరెంటు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వ్యవసాయ క్షేత్రాలకు 24 గంటలపాటు విద్యుత్ సరఫరా చేయాలి.

–చిన్నారెడ్డి, గగ్గుపల్లి

సరఫరా సరిగ్గా ఉండదు



24 గంటల విద్యుత్ సరఫరా ఆచరణలో కనిపించడం లేదు. కరెంటు సాయంత్రం ఐదున్నర గంటల నుంచి రాత్రి పదిన్నర వరకు సప్లై ఆగుతుంది. రాత్రి సమయంలో పొలం వెళ్తున్నప్పుడు విద్యుత్ షాక్‌తో మరణాలు సంభవిస్తున్నాయి.

–రాజ్‌కుమార్, గోవింద్‌పేట్

పసుపునకు ధర లేకపోవడం వ్యాపారుల కుట్రే

మార్కెట్‌యార్డులో రైతు జేఏసీ ఆందోళన



టైర్లు తగలబెట్టి నిరసన వ్యక్తం చేస్తున్న రైతు జేఏసీ నాయకులు

ఇందూరు(నిజామాబాద్): పసుపు పంటకు మార్కెట్‌లో ధర లేకపోవడం వ్యాపారుల కుట్రేనని ఆర్మూర్ డివిజన్ రైతు జేఏసీ నాయకులు ఆరోపించారు. బుధవారం నిజామాబాద్ మార్కెట్ యార్డులో ఆందోళన నిర్వహించారు. పసుపు పంటకు గిట్టుబాట ధర కల్పించకపోవడంపై టైర్లు కాల్చి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యాలయానికి తాళం వేసి గేటు ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా రైతు జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. పసుపు ధరను కృతిమంగా తగ్గిస్తున్న వ్యాపార సిండికేట్‌పై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డులో డీసీపీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, గతంలో విన్నవించినప్పటికీ ఏర్పాటు చేయకపోవడంపై మార్కెట్ కమిటీ అధికారులపై మండిపడ్డారు. రైతులతో సమావేశం నిర్వహించి పసుపునకు గిట్టుబాటు ధర ప్రకటించాలన్నారు. అలాగే ఎంపీ అర్వింద్ పసుపుబోర్డు తెస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, క్వింటాలుకు రూ. 15వేల ధర తీసుకురాని పక్షంలో రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు జేఏసీ నాయకులు అన్వేష్‌రెడ్డి, ప్రభాకర్, దేగాం యాదగౌడ్, దేవారం, లింగారెడ్డి, గంగారాం, వినోద్‌కుమార్ నర్సింలు, నరేష్ రైతులు పాల్గొన్నారు.

పోలీసులకు మార్కెట్ అధికారుల ఫిర్యాదు

మార్కెట్ కమిటీకి తాళం వేసి మార్కెట్ ప్రాంగణంలో ఆందోళన నిర్వహించి, మార్కెట్ కార్యకలాపాలకు ఇబ్బంది కలిగించారని రైతు జేఏసీ నాయకులపై మార్కెట్ కమిటీ అధికారులు మూడో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

న్యూస్‌రీల్

‘బీఆర్ఎస్’కు ఆహ్వానం లేదు

- ఆర్వోబీలను నేనే ప్రారంభిస్తా
- ఎంపీ అర్వింద్



సుభాష్‌నగర్: జిల్లాలో కొనసాగుతున్న ఆర్వోబీల ప్రారంభోత్సవాలకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను ఆహ్వానించబోమని ఎంపీ అర్వింద్ స్పష్టం చేశారు. వీటి పనులు వందశాతం కేంద్రం నిధులేనని, వాటిని తానే స్వయంగా ప్రారంభిస్తానన్నారు. బుధవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టుకు ఇంతవరకూ భూమిని అప్పగించలేదని, ఆ ఘనత సీఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితిని ఆగం చేసి, దేశంలో రైతు రాజ్యం తెస్తానని సీఎం కేసీఆర్ బీరాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. నగరంలోని నాగారం స్టేడియంను అభివృద్ధి చేసి క్రీడాకారులకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని గతంలో కలెక్టర్‌కు విన్నవించానన్నారు. నిజామాబాద్ రైల్వేస్టేషన్‌ను నూతన హంగులతో అభివృద్ధి చేసేందుకు నిధులు వెచ్చించారన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, నాయకులు, కార్పొరేటర్లు స్రవంతిరెడ్డి, పంచరెడ్డి లింగం, లక్ష్మీనారాయణ, ప్రవళిక, శ్రీనివాస్‌రెడ్డి, మధు పాల్గొన్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నా యకుడు రాజేందర్‌తో పాటు 25వ డివిజన్‌కు చెందిన పలువురు మహిళలు, యువకులు ఎంపీ అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరి డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ డిగ్రీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో బుధవారం ఒక విద్యార్థి డిబార్ అయినట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో నిజామాబాద్ నిశిత కామర్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజీ కేంద్రంలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఒక విద్యార్థి డిబార్ అయినట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో 9,701 మంది విద్యార్థులకు 8,773 మంది హాజరు కాగా 928 మంది గైర్హాజరయ్యారని చెప్పారు.

తెయూ పీజీ పరీక్షలు వాయిదా

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో శుక్రవారం నుంచి జరగాల్సిన పీజీ సెమిస్టర్ పరీక్షలను విద్యార్థుల వినతి మేరకు వాయిదా వేసినట్లు కంట్రోలర్ అరుణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ, ఎంబీఏ మొదటి, మూడో సెమిస్టర్స్, ఐఎంబీఏ 7వ, 9వ సెమిస్టర్స్ పరీక్షలను వాయిదా వేశామన్నారు. వాయిదా పడిన పరీక్షల షెడ్యూల్ తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి



డిచ్‌పల్లి: అటవీ సంరక్షణ నియమాలు–2022ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, పోడు సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. మండలంలోని కొరట్‌పల్లి గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వేలాది ఎకరాలు పార్ట్ ‘బీ’లో ఉన్న రైతులకు కొత్త పాసు బుక్కులు ఇవ్వాలని, రైతుబంధును అందజేయాలన్నారు. ధరణి పోర్టల్‌లో అనేక అవకతవకలు ఉన్నందున దానిని రద్దు చేయాలన్నారు. జిల్లా నాయకులు బుచ్చన్న, అర్మూర్ డివిజన్ కార్యదర్శి బాబురావ్, ముత్తన్న, లక్ష్మీ పాల్గొన్నారు.

‘ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లండి’

బాన్సువాడ టౌన్: బాన్సువాడలోని మాతా శిశు ఆస్పత్రికి జాతీయ స్థాయి గుర్తింపు లభించినందుకు గర్వంగా ఉందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో వైద్యులు, సిబ్బంది ముందుకు వెళ్లాలని సూచించారు. బుధవారం ఎంసీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది స్పీకర్‌ను కలిసి, అవార్డుకు సంబంధించిన లోగోను స్పీకర్‌కు అందించారు. కార్యక్రమంలో వైద్యులు సుధ, సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం లారీ చోరీ

నిజామాబాద్ సిటీ: బియ్యం బస్తాల లోడ్‌తో ఉన్న లారీ చోరీ అయింది. ఈ ఘటన మంగళవారం రాత్రి నిజామాబాద్ రూరల్ మండలం ఖానాపూర్ శివారులో చోటు చేసుకుంది. రూరల్ ఠాణా ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాలు.. నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన కందికంటి సుదర్శన్‌గౌడ్ మంగళవారం లారీ (ఏపీ24వీ 7796)లో లక్ష్మీ నరసింహ స్వరూపిని రైస్‌మిల్లులో 580 బస్తాల బియ్యం లోడ్ చేసుకున్నాడు. వాటిని ఖానాపూర్ శివారులో గల సీడబ్ల్యూసీ గోదాంలో అన్‌లోడ్ చేసేందుకు వెళ్లాడు. అక్కడ లైన్ ఉండటంతో లారీని అక్కడే పార్కు చేసి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం వెళ్లి చూడగా అక్కడ లారీ కనిపించలేదు. దీంతో ఆయన రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా లారీని పోలీసులు మహారాష్ట్ర సరిహద్దులోని సాలూర చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నారు. దొంగ లారీని చెక్‌పోస్టు వరకు తీసుకెళ్లి అక్కడే వదిలేసి పారిపోయాడు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.



ఖానాపూర్ శివారులో చోరీకి గురైన లారీ

ఉపాధి అక్రమాలపై కఠినచర్యలు చేపట్టాలి

వీసీలో రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా

సుభాష్‌నగర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా కలెక్టర్లకు సూచించారు. బుధవారం ఆయన రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ సంచాలకులు హనుమంతరావుతో కలిసి ఉపాధి హామీ సామాజిక తనిఖీ అంశంపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ ఆడిట్‌లో నిధులు దుర్వినియోగం జరిగినట్లు వెల్లడైన ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. నిధుల వినియోగంలో అవకతవకలకు పాల్పడిన వారిని ఉపేక్షించకూడదని, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు నిర్ధారణ అయిన పక్షంలో నిధుల రికవరీ, నోటీసులు జారీ వంటి వాటితోనే సరిపెట్టకుండా, అక్రమాల తీవ్రత ఆధారంగా బాధ్యులను విధుల నుంచి తొలగించాలని సూచించారు. ఈవిషయమై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు స్పందిస్తూ, సామాజిక తనిఖీ నివేదికల ఆధారంగా బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, డీఆర్‌డీవో చందర్, ఏపీడీ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు.. ప్రజల తిప్పలు..

- గల్లీల్లో గుంపులుగుంపులుగా స్వైరవిహారం
- నియంత్రించడంలో విఫలమవుతున్న అధికారులు
- ఆందోళన చెందుతున్న నగరవాసులు
- ఇంటి పన్నులను చెల్లించొద్దని వాట్సాప్‌లో వైరల్
- ఇప్పటికైనా అధికారులు స్పందించాలంటున్న ప్రజలు



నగరంలో గుంపులుగుంపులుగా తిరుగుతున్న కుక్కలు

నిజామాబాద్‌నాగారం: నగరంలో కుక్కల బెడత తీవ్రంగా మారింది. గల్లీల్లో ఎక్కడ పడితే అక్కడ గుంపులుగుంపులుగా తిరుగుతుండడంతో నగరవాసులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. పాదాచారులు, వాహనచోదకులను సైతం వెంటపడి మరీ తరుముతున్నాయి. ఒంటరిగా వెళ్తున్న వారిపై గుంపులుగా దాడి చేస్తుండడంతో ఏమి చేయలేకపోతున్నారు. కొన్ని సందర్భాల్లో వెంటాడి మరీ కరుస్తుండడంతో వీటి బారిన పడి గాయాలపాలైన వారి సంఖ్య అధికమైంది. ఒకటి కాదు, రెండు కాదు.. వేల సంఖ్యలో కుక్కలు రోడ్లపై స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కలను నియంత్రించాల్సిన అధికారులు అలసత్వం ప్రదర్శిస్తుండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ఇటీవల పసిబాలుడిని కరిచిన కుక్కలు

నగరంలోని నాగారంలోని 300 క్వార్టర్స్‌లో అద్దెకు ఉంటున్న నరేశ్ కుమారుడిని ఐదు రోజుల క్రితం కుక్క కరిచింది. అందరు ఉదయం సమయంలో తల్లి ఆరుబయట కూర్చుంది. బాబు కోసం పాల డబ్బా తీసుకురావడానికి ఇంట్లోకి వెళ్లిన సమయంలో కుక్కలు వచ్చి పసి బాలుడిని కరిచాయి. బాలుడి అరుపులతో బయటకు వచ్చిన కుటుంబ సభ్యులు కుక్కలను తరిమేశారు. వెంటనే బాలుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.

టాక్సులు కట్టబోమంటున్న ప్రజలు

నగరంలో కుక్కల బెడద దృష్ట్యా వాట్సాప్ గ్రూప్‌లో మహాలక్ష్మినగర్ కాలనీ వాసుల చాటింగ్ వైరల్ అవుతుంది. మున్సిపల్ సిబ్బంది, అధికారులు కుక్కలను నియంత్రిచలేకపోతున్నారు. మేము కూడా ఇంటి ట్యాక్స్ కట్టబోమంటూ గ్రూప్‌లో కాలనీవాసులు స్పందిస్తున్నారు.

సమాధానం చెప్పడం లేదు



మున్సిపాలిటీ పరిధిలో కుక్కలకు ఆపరేషన్లు చేయడానికి రూ. 20లక్షల బడ్జెట్ కేటాయించారు. కేవలం 400 కుక్కలకు ఆపరేషన్ చేశారు. ఒక్కో కుక్కకు రూ. 300లోపు ఖర్చయితే మూడింతలు ఖర్చయిందని చెబుతున్నారు. ఏ డివిజన్‌లో ఎన్ని కుక్కలు పట్టారో చెప్పకుండా కేవలం జవాన్ ద్వారా డిక్లరేషన్ మీద సంతకాలు పెట్టుకొని బిల్లులు తీసుకుంటున్నారు. కుక్కల నియంత్రణలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.

– గడుగు రోహిత్, కాంగ్రెస్ కార్పొరేటర్

సమస్య తీవ్రంగా ఉంది



మా ప్రాంతంలో కుక్కల బెడద అధికంగా ఉంది. పిల్లలను దుకాణాలను పంపించాలంటే భయమేస్తుంది. హైదరాబాద్‌లో జరిగిన సంఘటన గుర్తు చేసుకుంటే భయమేస్తుంది. అధికారులు కుక్కల బెడదను నివారించాలి.

– స్వాతి, ఆనంద్‌నగర్

కుక్క కరవడంతో ఇల్లు మార్చేశాడు



మా ప్రాంతంలో నివసించే నరేశ్ కుటుంబం తన కుమారుడికి కుక్క కరవడంతో మూడు రోజుల క్రితం కుటుంబాన్ని 300 క్వార్టర్స్ నుంచి 80 క్వార్టర్స్‌కు ఇల్లు మార్చేశాడు. ఎక్కడెక్కడి నుంచో కుక్కలను తీసుకువచ్చి మా ప్రాంతంలో ఉన్న డంపింగ్ యార్డులో వదిలేస్తున్నారు. దీంతో కుక్కలు నాగారం అంతా తిరుగుతున్నాయి.

– నరేశ్‌గౌడ్, నాగారం


కుక్కలను నియంత్రించాలి



నగరంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే తోడు లేకుండా వెళ్లలేకపోతున్నాం. కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతుండడంతో రోడ్డు మీద నడుచుకుంటే వెళితే ఎప్పుడు మీదకు వస్తాయోనని భయపడాల్సిన పరిస్థితి వచ్చింది.

– కుసుమ, డిగ్రీ కళాశాల లెక్చరర్

బయటకు వెళ్లాలంటే భయపడుతున్నాం



మా కాలనీలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఉంటారు. ఇక కుక్కలు గుంపులుగుంపులుగా రోడ్డు మీద తిరుగుతున్నాయి. దీంతో బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత కొన్ని నెలలుగా మున్సిపల్ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదు.

– జి.సూర్యకుమారి, మహాలక్ష్మినగర్

అధికారులు స్పందించాలి



నగరంలో కుక్క కాటు బాధితులు పెరుగుతున్నారు. రోడ్డుపై వెళ్లే కుక్కలు కరిచేందుకు మీదకు వస్తున్నాయి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు స్పందించడం లేదు. ఇప్పటికైనా కుక్కల బెడద లేకుండా చూడాలి.

– ఎస్.లావణ్య, కసాబ్‌గల్లి

స్పందించకుంటే నిరసనలు తెలుపుతాం



కుక్కలు, కోతుల నియంత్రణకు మున్సిపాలిటీ ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయిస్తుంది. కుక్కల వల్ల ప్రజలు ఇబ్బందుల పడుతున్నారని నేనే స్వయంగా మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాను. నిర్లక్ష్యపు సమాధానాలు చెప్పారు. హైదరాబాద్ ఘటన తర్వాత అయినా మేల్కోవాల్సిందే.

–స్రవంతిరెడ్డి, బీజేపీ ఫ్లోర్ లీడర్

క్లుప్తంగా

రేపు మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలు బంద్



ఇందూరు: ఖరీద్దారులు రైతులకు చెల్లించాల్సిన అమ్మకపు విలువ లో టాక్స్ కలెక్షన్ సోర్స్ (టీసీఎస్)ను కట్‌చేసి ఇస్తున్నందుకు నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 23న వ్యవసాయ మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలను నిలిపివేయనున్నట్లు నిజామాబాద్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు లాభిశెట్టి శ్రీనివాస్ గుప్తా తెలిపారు. మంగళవారం మార్కెట్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రైతులు సహకరించి ఈ నెల 23న మార్కెట్ కమిటీకి పసుపును తేవద్దని కోరారు. మర్చంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కమల్ కిశోర్, కోశాధికారి గోపాల్ రమేశ్, శంకర్, హన్మంత్ యాదవ్, మల్లేశ్, రవికుమార్, తదితరులున్నారు.

యథావిధిగా పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థుల అభ్యర్థన మేరకు తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ సెమిస్టర్ పరీక్షలను యథావిధిగా నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ మొదటి, మూడో సెమిస్టర్స్ (ఎంసీఏ, ఎంబీఏ, ఎల్‌ఎల్‌ఎం, ఎల్‌ఎల్‌బీ), 5వ 7వ, 9వ సెమిస్టర్స్ (ఎల్‌ఎల్‌బీ, ఐఎంబీఏ) పరీక్షలు ఈ నెల 24 నుంచి పాత షెడ్యూల్ ప్రకారమే ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు www.telanganauniversity.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

రీసెర్చ్ మెథడాలజీపై వర్క్‌షాప్



నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మంగళవారం కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో 'రీసెర్చ్ మెథడాలజీ'పై వర్క్‌షాప్ జరిగింది. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర జ్యోతి వెలిగించి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ప్రిన్సిపల్ ఇందిరా, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ వైద్య విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

టీఎన్జీవోస్ క్రీడలు ప్రారంభం



నిజామాబాద్ నాగారం: టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఉద్యోగులకు క్రీడలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ ఆధ్వర్యంలో మంగళవారం పాలిటెక్నిక్ మైదానంలో వేముల సురేందర్‌రెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈనెల 25 వరకు పోటీలు జరుగనున్నాయి. జిల్లా కార్యదర్శి అమృత్‌కుమార్, శ్రీనివాస్, నారాయణరెడ్డి, సుమన్, జాఫర్, జాకీర్, వేణు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గెలుపొందిన జట్లు

మొదటి మ్యాచ్ జిల్లా పరిషత్ వర్సెస్ డ్వామా మధ్య జరిగింది. ఇందులో డ్వామా జట్టు గెలిచింది. మరో మ్యాచ్‌లో వెల్ఫేర్ శాఖ, సీటీవో శాఖ తలపడ్డాయి. వెల్ఫేర్ శాఖ గెలిచింది. వ్యవసాయ వర్సెస్ పోలీస్‌శాఖ మధ్య పోటీ జరగ్గా వ్యవసాయ శాఖ గెలిచింది. ఆర్‌అండ్‌బీ, రిజిస్ట్రేషన్ శాఖ జట్టు మధ్య జరిగిన పోటీలో ఆర్‌అండ్‌బీ జట్టు గెలిచింది. డీపీవో, డీటీవో మధ్య పోటీలో డీపీవో విజయం సాధించింది. ఇరిగేషన్, మెడికల్ శాఖ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇరిగేషన్ జట్టు గెలుపొందింది. సర్వేశాఖ వర్సెస్ పశుసంవర్ధక శాఖ మ్యాచ్‌లో పశుసంవర్ధక శాఖ గెలిచింది.

ఒకరి అదృశ్యం



ఖలీల్‌వాడి: నగరంలోని గౌతమ్‌నగర్‌కు చెందిన బుడ్డం ప్రవీణ్ అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ప్రవీణ్ అర్సపల్లి సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మన్‌గా పనిచేస్తాడు. సోమవారం సాయంత్రం ఆఫీసుకు వెళ్లివస్తానని చెప్పి ఇంటికి రాలేదని భార్య శీతల్ మంగళవారం మూడో టౌన్ ఠాణాలో ఫిర్యాదు చేసింది.

చిన్న జీపీలపై భారం..

- వాణిజ్య విభాగం పరిధిలోకి ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లు
- ప్రతి మూడు నెలలకు రూ.1500 పన్ను
- తడిసి మోపెడవుతున్న నిర్వహణ ఖర్చులు



చాంద్‌మియాబాగ్ తండా జీపీ కార్యాలయం

జక్రాన్‌పల్లి: గ్రామాలను చెత్త రహితంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం పంచాయతీలకు ట్రాక్టర్లు అందజేసింది. వీటితో చెత్త సేకరణతో పాటు, హరితహారం మొక్కలకు నీరు పట్టాలని నిర్ణయించారు. ప్రభుత్వ ఆలోచన బాగానే ఉన్నా ట్రాక్టర్ల నిర్వహణలో అసలు పంచాయితీ ఏర్పడింది. కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లు వాణిజ్య విభాగం కింద రిజిస్ట్రేషన్ చేయించడంతో పంచాయతీలకు పెనుభారంగా మారింది. వీటిని వాణిజ్య విభాగంలోకి చేర్చడంతో ప్రతి మూడు నెలలకు రూ.1500 చొప్పున పన్ను కట్టాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లాలో 1056 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 1051 జీపీలకు ట్రాక్టర్లు ఉన్నాయి. మొత్తం ఏడాదికి రూ.63.04 లక్షలు ఉమ్మడి జిల్లాలోని జీపీలు పన్ను కట్టాల్సి వస్తోంది. దీనికి తోడు ఏటా రోడ్ ట్యాక్స్ రూ.ఆరు వేలు చెల్లించాలి. అలాగే ఇద్దరు మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలు, అదనపు ఖర్చులు అవుతున్నాయి. ప్రతి మైనర్ పంచాయతీకి ఏడాదికి రూ.మూడు లక్షల నుంచి రూ. నాలుగు లక్షల వరకు భారం పడుతోంది. మేజర్ పంచాయతీలకు రూ.ఐదు లక్షల వరకు నిర్వహణ వ్యయం అవుతోంది.

గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకువచ్చింది. పంచాయతీలకు కేంద్ర రాష్ట్ర నిధులతో పాటు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఇంటి పన్ను, నీటి పన్ను ద్వారా ఆదాయం సమకూరుతుంది. ఈ ఏడాది 14వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు వచ్చాయి. చిన్న గ్రామ పంచాయతీలకు రూ.20 నుంచి రూ.22లక్షలు, పెద్ద గ్రామ పంచాయతీలకు రూ.40లక్షల నుంచి రూ.55 లక్షల వరకు వచ్చాయి. ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్ల నిర్వహణకు ఏడాదికి రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతోంది. దీంతో చిన్న పంచాయతీలకు ఇబ్బంది అవుతోంది. దీనికి తోడు వీధిదీపాలు, తాగునీటి సరఫరా, విద్యుత్ బిల్లులు, పారిశుధ్య నిర్వహణ, పల్లె ప్రగతి కార్యక్రమాలకు ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. అలాగే హరితహారం నిర్వహణ, ట్రీగార్డుల కొనుగోలు, మొక్కల సంరక్షణ ఆర్థికభారంగా మారుతోంది.

అభివృద్ధి చేయలేకపోతున్నాం



తండాలు ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పడితే ఎంతో అభివృద్ధి జరుగుతుందని ఆశించాం. కానీ మైనర్ గ్రామ పంచాయతీ కావడంతో ఆశించిన స్థాయిలో నిధులు మంజూరు కావడం లేదు. వచ్చిన నిధులు గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాలు, హరితహారం నిర్వహణ, ట్రాక్టర్ల ఈఎంఐలకే సరిపోతున్నాయి. చిన్న జీపీలు ఏర్పడిన నిధులు లేకపోవడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదు.

– కిషన్‌నాయక్, సర్పంచ్, చాంద్‌మియాబాగ్ తండా

నిధులు సరిపోవడం లేదు..



నిధుల లేమి కారణంగా చిన్న గ్రామ పంచాయతీలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. వచ్చిన నిధులతో కరెంట్ బిల్లు, ట్రాక్టర్ల ఈఎంఐలు కట్టడానికే సరిపోతుంది. మూడు నెలలుగా సిబ్బందికి జీతాలు చెల్లించడం లేదు. గ్రామంలో నిర్మించిన భవన నిర్మాణాల అనుమతి డబ్బులను సైతం ప్రభుత్వం వాడుకుంటోంది. ఈ డబ్బులు జీపీ ఖాతాలో జమా చేయాల్సి ఉండగా పంచాయతీరాజ్ శాఖకే వెళ్లిపోతున్నాయి.

– సాయరెడ్డి, సర్పంచ్, మునిపల్లి

అచ్చం ఒకేలా..

ఎల్లారెడ్డి రూరల్: ఒకే పోలిక.. అచ్చం ఒకరిని చూస్తే మరొకరిని చూసినట్లే.. జిరాక్స్ టూ జిరాక్స్, ఒకే డ్రెస్.. ఇట్లా చెప్పుకుంటూ పోతే కవలల గురించి ఎన్నో అంశాల్ని పోల్చి చెప్పవచ్చు. తల్లిగర్భంలో ఒకే సారి, ఒకే రూపంతో మొదలై.. క్షణాల వ్యవధిలోనే బయటి ప్రపంచానికి పరిచయమై ఒకే ముఖకవలికలతో అందరినీ అమితంగా ఆకట్టుకుంటారు. అంతెందుకు పేర్లు కూడా ఒకేలా పెట్టుకొని తికమక చేస్తుంటారు. నేడు ప్రపంచ కవలల దినోత్సవం సందర్భంగా కథనం..



- ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన వారాల వేణు వీణ దంపతుల కుమార్తెలు చైత్రిక, స్మితికలు 16 అక్టోబర్ 2008వ సంవత్సరంలో జన్మించారు.



- మండలంలోని సోమార్‌పేట గ్రామానికి చెందిన జంబిగ మౌనిక జీవన్ దంపతుల సంతానమైన సాహస్, సాహస్ర 19 జూలై 2014లో పుట్టారు.



- ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన తాటిచెట్టి రజిత, శ్రీనివాస్ దంపతుల సంతానమైన గిరిధర్, గీతిక 2014 జూలై 14న జన్మించారు.



- ఎల్లారెడ్డి మండల ఆజామాబాద్ గ్రామానికి చెందిన పట్లోళ్ల ఉమాదేవి–శ్రీనివాస్ దంపతుల సంతానమైన గణాదిత్య, విక్రమాదిత్య 2010 జనవరి 27న జన్మించారు.



- ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన అన్నపూర్ణ– శ్రీ నివాస్‌గౌడ్ దంపతుల సంతానమైన సుకృతి, సంహిత 12 మే 2004న జన్మించారు.



- ఎల్లారెడ్డికి చెందిన జ్యోతి– కీర్తిరాజ్ దంపతులకు అనన్య, అనిష్ 1 అక్టోబర్ 2018న పుట్టారు.



- ఎల్లారెడ్డికి చెందిన పట్టెం ప్రసాద్, ప్రేమలతలకు హర్ష–హర్షిత్ 10 మే 2018న జన్మించారు.



కార్తీక్, కరుణ



శ్రీనాథ్, హరినాథ్

త్వరలో అర్హులకు పోడు పట్టాలు

- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి



మోస్రాలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

రుద్రూర్(మోస్రా): పోడు భూములకు సంబంధించిన సర్వేలు పూర్తయ్యాయని, అర్హులకు త్వరలోనే పట్టాలు పంపిణీ చేస్తారని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మోస్రా మండల కేంద్రంలో మంగళవారం మోస్రా, చందూర్ మండలాల అభివృద్ధిపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నూతనంగా ఏర్పడిన మోస్రా, చందూర్ మండలాలకు కేటాయించిన నిధుల వివరాలు వెల్లడించారు. కాంప్లెక్స్ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, కుల సంఘాలు, గ్రామ పంచాయతీ భవనాలకు నిధులు ఇచ్చినట్లు చెప్పారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై ఎవరైనా అనవసర విమర్శలు చేస్తే తిప్పికొట్టాలన్నారు. మోస్రా, చందూర్ లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్పీకర్ అందజేశారు. ఈ సమావేశంలో బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు, జెడ్పీటీసీ గుత్ప విజయ భాస్కర్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు పిట్ల శ్రీరాములు, తహసీల్దార్ సాయిలు, పోచారం సురేందర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్



నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ ప్రాక్టికల్ రెండో స్పెల్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన పరీక్షల్లో 44మంది జనరల్ విద్యార్థులు, ఒకేషనల్‌లో 55 మంది విద్యార్థులు గైర్హాజయ్యారు. మధ్యాహ్నం జనరల్ 894మంది విద్యార్థులకు 863మంది, ఒకేషనల్ 304మంది విద్యార్థులకు 245 మంది హాజరయ్యారు. డీఐఈవో రఘురాజ్ ఐదు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

నాణ్యమైన వైద్య సేవలందించాలి

- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి



విద్యార్థినితో మాట్లాడుతున్న ప్రొఫెసర్ లింబాద్రి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ హెల్త్ సెంటర్‌లో వర్సిటీ విద్యార్థులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి అన్నారు. మంగళవారం తెయూ క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. హెల్త్ సెంటర్‌లోని గదులను సందర్శించి చికిత్స పొందుతున్న విద్యార్థినులతో మాట్లాడి వైద్య సేవలు, మందులు, వసతి సౌకర్యాల వివరాలు తెలుసుకున్నారు. వైద్యురాలు అనూషతో మాట్లాడారు. సెంటర్‌లో అవసరమైన సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. వీసీ రవీందర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని, పీఆర్‌వో జమీల్, అధ్యాపకులు ఉన్నారు.

ఠాణాలో యువకుడి వీరంగం

రామారెడ్డి: రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఓ యువకుడు వీరంగం సృష్టించాడు. గ్రామానికి చెందిన బీట్ల రవి సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో మద్యం మత్తులో ఠాణాకు వెళ్లి హంగామా చేశాడు. పోలీసులను దూషించి, గొడవ చేశాడు. దీంతో రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

నెమలిని కాపాడిన రైతు



సిరికొండ : బావిలో పడిన జాతీయ పక్షి నెమలిని ఓ యువ రైతు కాపాడాడు. మండలంలోని కొండూర్ గ్రామంలో పొలాల్లో నీళ్ల ఎండిపోయిన బావిలో నెమలి పడింది. పొలం వద్దకు వెళ్లిన యువ రైతు లింబారెడ్డికి బావిలో నుండి నెమలి అరుపులు వినిపించాయి. బావి వద్దకు వెళ్లి చూడగా నెమలి బావిలో ఉంది. తాడు సాయంతో బావిలోకి దిగి నెమలిని కాపాడి పైకి తీసుకొచ్చారు. అలసిపోయిన నెమలికి లింబారెడ్డి నీళ్లు తాగించి అడవిలో వదిలిపెట్టాడు.

ఏసీబీకి చిక్కిన కౌడిపల్లి ధరణి ఆపరేటర్

- భూ రిజిస్ట్రేషన్ చేసేందుకు లంచం డిమాండ్
- రైతు ఫిర్యాదు మేరకు పట్టుకున్న ఏసీబీ అధికారులు
- ఆపరేటర్ స్వగ్రామం నందివాడలోనూ సోదాలు

కౌడిపల్లి(నర్సాపూర్): పది గుంటల వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ కోసం లంచం డిమాండ్ చేయగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ సంఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాజాగౌడ్, రమేశ్‌తో కలిసి మంగళవారం రాత్రి వివరాలు వెల్లడించారు. కౌడిపల్లి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రైతు నీరుడి పోచయ్య గ్రామానికి చెందిన పానుగంటి సత్తమ్మ నుంచి 20 గుంటల భూమిని కొనుగోలుకు అగ్రిమెంట్ చేసుకున్నాడు. అందులో నుంచి 10 గుంటల భూమిని ఇతరులకు అమ్మివేశాడు. మిగతా 10 గుంటల భూమిని తనపేరును రిజిస్ట్రేషన్ కోసం గత నెల 25వ తేదీన తహసీల్దార్ కార్యాలయంలోని ధరణి ఆపరేటర్ వేణురెడ్డిని కలిశాడు. కాగా రిజిస్ట్రేషన్ కోసం రూ.20 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో అదేరోజు రైతు ఏసీబీ అధికారులను సంప్రదించాడు. మంగళవారం రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్‌చేసుకోగా లంచం డబ్బు తెచ్చినట్లు చెప్పడంతో రిజిస్ట్రేషన్ పూర్తి చేశాడు. రిజిస్ట్రేషన్ అనంతరం డబ్బులు రూ.20 వేలు కౌడిపల్లి మండలం లింగంపల్లితండాకు చెందిన కెతావత్ రాజుకు ఇవ్వమని వేణురెడ్డి చెప్పడంతో తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో డబ్బులు ఇచ్చాడు. దీంతో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ధరణి ఆపరేటర్ వేణురెడ్డి, మధ్యవర్తి రాజుపై కేసునమోదు చేశారు. లంచం విషయమై వీరితోపాటు తహసీల్దార్ కార్యాలయంలో ఇంకా ఎవరి ప్రమేయం ఉందన్న విషయం విచారణ చేస్తున్నారు. వేణురెడ్డి స్వగ్రామం కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం నందివాడ. అతడి ఇంటిలో సోదాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నందివాడలో కలకలం!

తాడ్వాయి: ఏసీబీకి చిక్కిన కౌడిపల్లి ధరణి ఆపరేటర్ వేణురెడ్డి స్వగ్రామం తాడ్వాయి మండలంలోని నందివాడ. మంగళవారం రాత్రి ఆయన స్వగ్రామంలోని ఇంట్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. నందివాడలో ఏసీబీ అధికారులు సోదాలు జరపడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య

భిక్కనూరు: భిక్కనూరు పరిధిలోని ఎంఎస్ఎన్ కెమికల్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న బీహార్‌కు చెందిన సూరజ్‌కుమార్ (20) ఆత్మహత్య చేసుకున్నాడు. ఫ్యాక్టరీ ఆవరణలో మంగళవారం రాత్రి ఉరి వేసుకున్నట్లు ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు. ప్రేమ వ్యవహారంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు తోటి కార్మికులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఇంటి వద్దే తపాలా ఖాతాలు

నిజామాబాద్ సిటీ: తపాలా శాఖ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఇంటి వద్దనే ఖాతాలు ప్రారంభిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సీనియర్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోస్ట్ ఇన్ ఫో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు నమోదు చేస్తే మీ ఇంటి వద్దకు సంబంధించిన పోస్టాఫీస్ అధికారి వచ్చి దరఖాస్తులను ఇచ్చి పోస్టల్ ఖాతా తెరుస్తారన్నారు. ఈ సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత సంవత్సరంలో అకౌంట్స్ టార్గెట్స్ సాధించటంలో హైదరాబాద్ రీజినల్ నిజామాబాద్ డివిజన్ పోస్ట్ ఆఫీస్ మూడో స్థానంలో నిలిచిందని చెప్పారు. ప్రతి పోస్టాఫీస్‌లో ఈ నెల 20 నుంచి 24 వరకు పొదుపు ఖాతాల మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వివరాలకు 18002666868ను సంప్రదించాలన్నారు.

జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్టు



బహుమతులను అందజేస్తున్న ఎంఈవో

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్(ఎఫ్‌పీఎస్‌టీ) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. పరీక్షకు జిల్లాకు చెందిన పలు మండలాలకు చెందిన 46 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆర్మూర్ మోడల్ స్కూల్ విద్యార్థి సయ్యద్ అహ్మద్ ప్రథమ స్థానంలో, ఎస్సారెస్పీ గురుకుల పాఠశాలకు చెందిన ఎండీ సఫీయాన్ ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. డీఎస్‌వో గంగకిషన్, డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య, ఎంఈవో రాజ గంగారం ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. ప్రతిభ కనబరిచిన వంశి, రుషిక, నిషాంతకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఎఫ్‌పీఎస్‌టీ జిల్లా అధ్యక్షుడు శివ ప్రసాద్, రఘునాథ్, శ్రీనివాస్‌గౌడ్, మగ్గిడి గంగాధర్, లక్ష్మణ్, హెచ్‌ఎంలు గంగారం, అనసూయ పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన రాష్ట్ర బృందం



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర అధికారులు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి, హాసాకొత్తూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలను రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) సభ్యులు మంగళవారం తనిఖీ చేశారు. రాష్ట్ర మానిటరింగ్ అధికారి శ్రీనాథ్ నేతృత్వంలో సబ్జెక్ట్ నిపుణులు సంజీవ్, రామకృష్ణ, చక్రధర్, ఎఫ్‌ఎల్‌ఎన్ రాష్ట్ర అధికారి కిషన్ విద్యార్థులకు అందిస్తున్న బోధన విధానాలు, సౌకర్యాలను తెలుసుకున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహణ, స్నాక్స్ ఇస్తున్నారా, ఉదయం వేకప్ కాల్ చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పదో తరగతికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎంఈఓ ఆంధ్రయ్య ఉన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం



నందిపేట్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తున్న మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి

నందిపేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యాయని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం నందిపేటలో ఆయన కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు గుర్తు చేస్తున్నామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, కేశ వేణు, గడువు గంగాధర్, జావిద్, గంగిరెడ్డి, గంగారెడ్డి, గంగాధర్ గౌడ్, విక్కీ యాదవ్, పెంట ఇంద్రుడు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభం



క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం సాయంత్రం రాష్ట్ర సీనియర్ సాఫ్ట్‌బాల్ మహిళల ప్రాబబుల్స్ జట్టు శిక్షణ శిబిరం ప్రారంభమైంది. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్ క్రీడాకారిణులను పరిచయం చేసుకుని శిక్షణను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణలో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తారని తెలిపారు. నరేష్‌చంద్ర, ప్రిన్సిపాల్ గోదావరి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ప్రభాకర్‌రెడ్డి, గంగమోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు నల్లూరి లత, సురేష్, కోచ్ వేముల మౌనిక పాల్గొన్నారు.

కరెంట్ బిల్ పేరిట రూ.49 వేలు టోకరా

- వెంటనే ఫిర్యాదు చేయడంతో డబ్బు ఫ్రీజ్



కామారెడ్డి క్రైం: సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఓ వ్యక్తికి చెందిన రూ.49 వేల నగదు నేరస్తుల ఖాతాలోకి వెళ్లకుండా సైబర్ పోలీసులు ఫ్రీజ్ చేశారు. ఈ ఘటన మంగళవారం దేవునిపల్లిలో పరిధిలో వెలుగు చూసింది. వివరాలు.. దేవునిపల్లిలో నివాసం ఉండే రాజేశ్వర్‌రావుకు ఈనెల 20న ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మీ ఇంటి కరెంట్ బిల్లు రెండు నెలలుగా కట్టలేదని, ఇప్పుడు చెల్లించకపోతే సరఫరా నిలిపి వేస్తామని హెచ్చరించారు. తాను పంపిన లింక్ క్లిక్ చేసి బిల్లు కట్టాలని సూచించాడు. దీంతో రాజేశ్వర్‌రావు అలాగే చేయడంతో సదరు వ్యక్తి అకౌంట్లో నుంచి రూ.49 వేలు కట్ అయ్యాయి. వెంటనే బాధితుడు బ్యాంక్ అధికారులను సంప్రదించగా సైబర్ మోసం జరిగిందని బ్యాంకర్లు చెప్పారు. దీంతో ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సైబర్ క్రైమ్ పోలీసులు సదరు అకౌంట్లో నుంచి సైబర్ నేరస్తుల అకౌంట్‌కు డబ్బులు వెళ్లకుండా ఫ్రీజ్ చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ తెలిపారు.

క్రైం కార్నర్

ఎంత పెద్ద పామో!



నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలోని సుభాష్‌చంద్రబోస్ కాలనీలో మంగళవారం పొడవైన నాగుపాము ప్రత్యక్షమయింది. కాలనీలో పిల్లలు ఆడుకుంటున్న ప్రాంతంలోకి పాము రావడంతో అక్కడే ఉన్న మహిళలు గుర్తించి స్థానిక యువకులకు సమాచారం ఇచ్చారు. దీంతో యువకులు అక్కడికి చేరుకొని దానిని చంపారు. ఆ పాము సుమారు ఆరు ఫీట్లకు పైగా ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మహేందర్(ఫైల్)

నవీపేట: మెదక్ జిల్లా రామాయంపేట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నవీపేటకు చెందిన యువకుడు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ముత్యాల మహేందర్(29) హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. వారం క్రితం ఆయన హైదరాబాద్ నుంచి నవీపేటకు వచ్చాడు. సోమవారం సాయంత్రం స్కూటీపై హైదరాబాద్ వెళ్తుండగా రామాయంపేట శివారులో నర్సింగి వద్ద డివైడర్‌ను ఢీకొన్నాడు. తీవ్ర గాయాల పాలైన ఆయనను అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి తల్లి శాంతాబాయి, భార్య సంధ్య ఉన్నారు. ప్రస్తుతం సంధ్య గర్భిణి అని గ్రామస్తులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతు..



లింబాద్రి (ఫైల్)

ధర్పల్లి: విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన ధర్పల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై వంశీకృష్ణ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన తోట లింబాద్రి (48) సోమవారం రాత్రి తన పంట పొలానికి నీరు పెట్టి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. మంగళవారం ఉదయం వరకు తిరిగి రాకపోవడంతో ఆయన కుమారుడు నరేష్ పొలం వద్దకు వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించాడు. బోరు మోటార్ వైర్లు తగిలి షాక్ కొట్టి చనిపోయినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా లింబాద్రి ధర్పల్లి బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన మృతిపై జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, నాయకులు సంతాపం తెలిపారు.